సాక్షి
తిరుపతి

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



మహిళా వర్సిటీలో..

పద్మావతి మహిళా వర్సిటీని నేపాల్ ఖాట్మండ్ వర్సిటీకి చెందిన బృందం శనివారం సందర్శించింది. - 8లో



రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం

శ్రీసిటీలో రబ్బరు, టైర్ రీసెర్చ్(ఆర్‌టీఆర్‌ఎల్) ల్యాబ్‌ను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. - 8లో



ఉసురు తీసిన వివాహేతర సంబంధం

ప్రియుడు మాట్లాడలేదని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పిచ్చాటూరులో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

వేతన వెతలు

- గురుకుల సిబ్బందికి జీతాలెక్కడ?
- రెండు నెలలుగా అవస్థలు

తిరుపతి అర్బన్: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జూన్, జూలై నెలలకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. తిరుపతి జిల్లాలో 10 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 300 మంది, చిత్తూరు జిల్లాలో 7 పాఠశాలలు, కళాశాలల్లో 210 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులతోపాటు కాంట్రాక్ట్, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న వారికి జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. సంపద సృష్టిస్తాం.. జీతాలు ఎగ్గొడుతాం 'మేము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తాం. ప్రతి నెలా ఉద్యోగులకు క్రమంతప్పకుండా 1వ తేదీనే జీతాలు వేస్తాం' అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబునాయుడు గద్దెనెక్కిన తర్వాత తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. కొందరికి ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలిస్తూ మరికొందరికి పూర్తిగా ఎగ్గొట్టడంపై ఉద్యోగులు విమర్శలు సంధిస్తున్నారు. తాము ఉద్యోగులంగా కనిపించలేదా అంటూ ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

దివ్యదర్శనం టోకెన్ల జారీ కేంద్రం తనిఖీ



టిక్కెట్ల కౌంటర్లను తనిఖీ చేస్తున్న ఈఓ, ఏఈఓ, జేఈఓ, సీవీఎస్‌ఓ

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో దివ్య దర్శనం, ఎస్‌ఎస్‌డీ టోకెన్ల జారీ కేంద్రాన్ని శనివారం టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరితో కలిసి తనిఖీ చేశారు. అలిపిరి వద్ద భక్తులకు ఇదివరకు జారీచేస్తున్న దివ్యదర్శనం టోకెన్లను పునఃప్రారంభించేందుకు సాధ్యాసాధ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్‌ఎస్‌డీ టోకెన్ల జారీ ప్రక్రియ, క్యూలైన్లను, ఎస్వీబీసీ మాస్టర్ కంట్రోల్ రూమ్, ఎస్వీబీసీ పాత పరిపాలనా భవనాన్ని పరిశీలించారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా టోకెన్లు జారీ చేయడానికి శాశ్వత క్యూలైన్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలిపిరి పాదాల మండపం వద్ద దివ్య దర్శనం టోకెన్ల జారీ కేంద్రాన్ని, టీటీడీ జలప్రసాదాన్ని, లగేజీ కౌంటర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈవో వెంట జేఈవో వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్వో శ్రీధర్, సీఈ నాగేశ్వరరావు, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్ ఉన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ హరికిరణ్

తిరుపతి తుడా : రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సీ.హరికిరణ్ శనివారం తిరుపతిలో పర్యటించారు. ఈ సందర్భంగా డీఈఐసీ చిన్న పిల్లల కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న సేవలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ పద్మావతి, సీఎంఓ రూప కుమార్, బాబు, నెప్రూరెడి పాల్గొన్నారు.

మాటల్లో కాదు ..చేతల్లో రక్షణ కావాలి



దేశంలో ఎక్కడో ఒకచోట వైద్యుల పట్ల దాడి జరిగితే వేగంగా స్పందించి హామీలతో చేతులు దులుపుకోవడం వంటివి వద్దు. ప్రభుత్వాలు కానీ టీటీడీ కానీ మా భద్రతకు మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించాలి. స్విమ్స్ లో మహిళా వైద్యులకు మరింత రక్షణ అవసరం. 36 గంటల పాటు కంటిన్యూగా వైద్య సేవలు అందిస్తున్న మాకు రక్షణ కల్పించలేరా..? డ్రెస్సింగ్ రూమ్, రెస్ట్ రూమ్ లు కూడా లేకుండా మేము విధులు ఎలా నిర్వహించాలి..? టీటీడీ రక్షణతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

- డాక్టర్ విష్ణుశ్రీ, స్విమ్స్



వైద్యుల్లో నమ్మకం కలిగించాలి



భవిష్యత్‌లో వైద్యులపై దాడులు జరగవు అన్న నమ్మకాన్ని ప్రభుత్వాలు కల్పించాలి. ఆ దిశగా తక్షణం జూనియర్ డాక్టర్లతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలి. వారి సలహాలు, సూచనలు తీసుకోవాలి. వారి విజ్ఞప్తుల ఆధారంగా ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత పెంచాలి. మెరుగైన సౌకర్యాలను కల్పించడం వల్ల వారిలో ఒత్తిడి తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలి. రోగుల అటెండర్ల రాకపోకల విషయంలోనూ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి. డాక్టర్లకు భద్రత లేకుంటే వైద్యం అందించడం కష్టం. ఈ విషయాన్ని రోగుల సహాయకులు గుర్తించాలి.

- డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

పులికాట్ ఘుమఘుమలు!

పులికాట్ సరస్సు పేరు వినగానే దేశ, విదేశీ విహంగాలు, సరస్సు మధ్యలో వేటాడే మత్స్యకారులే గుర్తుకొస్తుంటారు. మరికొందరు ఆహ్లాదకరమైన దృశ్యాలను నెమరువేసుకుని మురిసిపోతుంటారు. కానీ సరస్సు పరిధిలోని గ్రామాల ప్రజలకు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మాంసాహార ప్రియులకు మాత్రం నోరూరించే చేపలు, రొయ్యలు, పీతలే జ్ఞప్తికి వస్తుంటాయి. పేదలకు సైతం సరసమైన ధరలకు దొరికే మత్స్య సంపదపై ఓ లుక్కేద్దాం.



పులికాట్‌లో లభించే మొయ్యచేపలు, తుళ్లు చేపలు

- లొట్టలేసుకుంటున్న మాంసాహార ప్రియులు
- రుచిలో సాటిలేని చేపలు, రొయ్యలు, పీతలు
- విహంగాలకూ ఆహారభాండాగారంగా విరాజిల్లుతున్న పులికాట్ సరస్సు
- ముఖద్వారాల పూడికతో కనుమరుగవుతున్న కొన్ని రకాల మత్స్య సంపద

తడ: ఉప్పు, తీపినీటి కలయికతో ఉండే పులికాట్ సరస్సులో లభించే మత్స్య సంపదకు రుచి ఎక్కువ. ఇక్కడ ఒంటి నిండా కండతో ఒక్కోటి వంద గ్రాముల నుంచి నాలుగు కిలోలకు పైగా బరువుండే మొయ్య చేపలు, తెల్లగా తళతళలాడే కిలోకి పైగా బరువుండే తుళ్ల చేపలు, పొడవాటి ముక్కులతో ఉండే కోలాసులు, ఒళ్లంతా ముళ్లతో పులుసుకు అదిరిపోయే రుచినిచ్చి అబ్బో అనిపించే ముళ్ల చేపలు విరివిగా దొరుకుతుంటాయి. వీటితోపాటు బయట మార్కెట్లో లభించే పెంపుడు రొయ్యల కన్నా ఎంతో రుచిగా ఉండే తెల్ల రొయ్యలు, పెద్దపెద్ద పీతలు ఇక్కడ అందుబాటులో లభిస్తాయి. పులుసు, వేపుడు, తియ్యకూర వంటి పలు రకాల వంటకాల్లో ఒదిగిపోయే ఇక్కడి చేపలు ఒక్కో రకం ఒక్కో రుచిని అందిస్తూ.. మాంసాహార ప్రియులను ఆకట్టుకుంటాయి.

బయటి ప్రాంతాల్లో పెంపకం


సరస్సులో అననుకూల వాతావరణ నేపథ్యంలో చేపల ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో మొయ్యలు, తుళ్లలు బయట ప్రాంతాలో పెంచడం మొదలు పెట్టారు. ఇవి మంచి సైజులో లభ్యమవుతూ ఉన్నప్పటికీ సరస్సులో లభించే వాటి రుచికి ఏ మాత్రం దరిచేరలేకున్నాయి. పులికాట్‌లో కేజ్ కల్చర్ ద్వారా రొయ్యలు పెంచాలని ప్రయత్నించినా బురద చేరి పోవడంతో అది విఫలమైంది.

ఉపాధినిస్తూ..నోరూరిస్తూ..!



పులికాట్‌కే సొంతం అయిన తెల్ల రొయ్యలు

600 చ.కి.మీ విస్తీర్ణంతో వాకాడు మండలం, దుగరాజపట్టణం నుంచి తమిళనాడులోని పళవేర్కాడు వరకు విస్తరించి ఉన్న పులికాట్ సరస్సులో ఎక్కువ భాగం (460 చ.కి.మీ) ఆంధ్రాలోనే ఉంది. పులికాట్ పరిధిలోని 17 జాలర్ల కుప్పాలకు చెందిన సుమారు 10 వేల మంది మత్స్యకారులతోపాటు గిరిజనులు, దళితులు చేపలు పట్టుకొస్తే మహిళలు వాటిని మార్కెట్లలో, గ్రామాల్లో తిరిగి విక్రయిస్తారు. ఇక్కడి చేపలను ఎండబెట్టి ఎండు చేపల కింద విక్రయాలు జరుపుతున్నారు.



తడ బజారు మార్కెట్లో విక్రయిస్తున్న మత్స్యకార మహిళ



పట్టుబడ్డ మత్స్యసంపదను ఒడ్డుకు చేరుస్తున్న జాలర్లు

భలే రుచిగా ఉంటాయి



కాల, కొడువ, ఓడ, చిలవై లాంటి పెద్దపెద్ద చేపలు దొరికేవి. ఇవి ఒక్కోటి మూడు నుంచి నాలుగు కిలోల వరకు లభించేవి. అలాగే కదంబర అనే రకం రొయ్యలు గుంపులుగా వచ్చేవి. ఇవి భలే రుచిగా ఉండడంతో స్థానికులేగాక సమీప ప్రాంతాల వారు తండోపతండాలుగా తరలివచ్చి కొనుగోలు చేసేవారు.

– ఆర్.శివాజీ, పూడికుప్పం, మత్స్యకారనాయుడు

వ్యాపారుల రాక తగ్గింది



గతంలో పులికాట్‌లో దొరికే మత్స్య సంపద కోసం చెన్నై నుంచి వ్యాపారులు వచ్చేవారు. లక్షల రూపాయలు పెట్టి మత్స్య సంపదను తీసుకెళ్లేవారు. ఆదాయంతోపాటు మంచి గిట్టుబాటు ధర కూడా వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వ్యాపారుల రాక తగ్గిపోయింది. ఎర్రలు వేటాడడం కూడా మత్స్య సంపద తగ్గిపోవడానికి కారణంగా ఉంటోంది.

– టీ.కోదండం, తడకుప్పం, మత్స్యకార నాయుడు

ఇక్కడి టేస్ట్ ఎక్కడా దొరకదు



పులికాట్ సరస్సులో దొరికే చేపలకు యమ క్రేజీ ఉంటుంది. ఇక్కడి చేపలు భలే రుచిగా ఉంటాయి. మా కుటుంబంలో పిల్లలు, పెద్దలు లొట్టలేసుకుని తింటారు. అందుకే నేను ప్రతి ఆదివారం పులికాట్‌కు వెళ్లి చేపలు తెస్తుంటాను. సైజును బట్టి మొయ్య చేపలు కిలో రూ.300 నుంచి రూ.350 వరకు దొరుతాయి.

– రమేష్‌రెడ్డి, తడకండ్రిగ

విహంగాల ఆహార భాండాగారం



ఆహార అన్వేషణకు పయనమైన విహంగాలు

పులికాట్ సరస్సు వేలాదిగా తరలి వచ్చే దేశ, విదేశీ విహంగాలకు ఆహార భాండాగారంగా ఉంది. పులికాట్‌లో లభించే ఆహారాన్ని నమ్ముకుని తమ సంతానోత్పత్తి సమయంలో ప్రతి ఏటా వేలాది కిలోమీటర్లు వచ్చే ఫ్లెమింగోలు, గూడబాతులు, దేశవాళీ కొంగలు వంటి అనేక రకాల పక్షులు అనాదిగా ఇక్కడ సంతానోత్పత్తిని సాగిస్తున్నాయి. గతంలో పులికాట్ ద్వారా టన్నుల కొద్దీ మత్స్య సంపద లభించినప్పటికీ పులికాట్ ముఖ ద్వారాలు పూడి పోవడంతో క్రమేపీ అవో తీపిగుర్తులుగా మిగిలిపోనున్నాయి.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,098 మంది స్వామిని దర్శించుకున్నారు. 34,707 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించబోమని పేర్కొంది.

అదనపు ఈఓ విస్తృత తనిఖీలు



తనిఖీ చేస్తున్న అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

తిరుమల: టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి శనివారం తెల్లవారుజామున తిరుమలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2, కృష్ణతేజ సర్కిల్, నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు, క్యూలైన్లను పరిశీలించారు. భక్తులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు అందించే విధానాన్ని పరిశీలించారు. భక్తులకు అందించే ఆహార పానీయాలు, సమయాలను కంపార్ట్‌మెంట్ల వెలుపల ఉన్న బోర్డులపై రాయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కంపార్ట్‌మెంట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ జాప్యం లేకుండా భక్తులను దర్శనానికి పంపించాలని సూచించారు. కృష్ణతేజ సర్కిల్ వద్ద భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించే మార్గాల వద్ద అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడాన్ని గుర్తించి డ్రైవర్లను హెచ్చరించారు. అనధికారిక పార్కింగ్‌ను నివారించేలా పోలీసులతో చర్చలు జరపాలని టీటీడీ విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఈఓలు గంగాధరం, మునిరత్నం తదితరులు ఉన్నారు.

ఆహాకారం!





నోరుంటే అడుక్కుతినైనా బతకొచ్చు, కానీ నోరులేని మూగ జీవాలు ఎలా బతికేది..? యజమానులు పాలు పితుక్కుని రోడ్డుపై వదిలేస్తే ఎలా జీవించాలి..? అందుకే ఓ ఆవు ఆకలికి తాళలేక తిరుపతి కరకంబాడి రోడ్డు వద్ద ఓ ప్రభుత్వ మద్యం దుకాణం కౌంటర్లో ఉన్న అట్ట పెట్టెలను లాక్కుతింటూ కనిపించింది. ఓ పక్క మద్యం కోసం మందుబాబులు బారులు తీరుతుంటే.. మరో పక్క దుకాణంలో అందినకాడికి అట్టపెట్టెలను లాక్కుతినడం ప్రారంభించింది. ఈ సంఘటనను శనివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఐ మిస్ యూ డాడ్!

వాకాడు/ కోట: 'చిన్నపటి నుంచి నీ ఇద్దరి కుమార్తెలను ఎంతో గారాబంగా పెంచావు. రెక్కలు ముక్కలు చేసుకుని కూతుళ్లను పెంచి పెద్ద చేశావు. పస్తులుండి నన్ను డాక్టర్ వరకు చదివించావు. ఇంకా పెద్ద డాక్టర్ కావాలని కలలుగని అంతలోనే దూరమయ్యావు. నన్ను పెంచి పెద్దదాన్ని చేసి, డాక్టర్ చదివించిన నీకు నేను ఏం చేయలేకపోయాను నాన్నా..? ఐ మిస్ యూ డాడీ!' అంటూ ఆ డాక్టరమ్మ కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడి వారిని కలచివేసింది. శుక్రవారం అర్ధరాత్రి కేసవరం వద్ద ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ పవన్ కుమార్ కథనం.. వాకాడు మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన కావలి గోపాలయ్య(53) తన కుమార్తె పవిత్రను ఎంబీబీఎస్ పూర్తిచేయించాడు. అలాగే హౌస్ సర్జన్‌గా ఏడాదిపాటు పూర్తి చేసి విజయవాడలోని హెల్త్ యూనివర్సిటీలో డాక్టర్ కోర్సు పూర్తి చేసుకున్నట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి కుమార్తెను తీసుకుని వెళ్లాడు. అక్కడ పని పూర్తిచేసుకుని తిరిగి శుక్రవారం రాత్రి 11 గంటలకు ట్రైన్‌లో గూడూరుకు వచ్చాడు. నెల్లిపూడికి వెళ్లేందుకు సమీప బంధువు వాకాడుకు చెందిన సందీప్ మోటార్ బైక్‌పై బయలుదేరారు. కేసవరం సమీపంలోని రైస్‌మిల్లు వద్ద గూడూరు వైపు వెళ్తున్న మినీలారీ వేగంగా మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది గూడూరు ఏరియా హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే గోపాలయ్య మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. సందీప్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లారు. మృతుడి అన్న కుమారుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



తీవ్ర గాయాలతో పడి ఉన్న సన్నీ



తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న పవిత్ర (ఇన్‌సెట్) గోపాలయ్య (ఫైల్)

క్లుప్తంగా

మహిళా వర్సిటీలో నేపాల్ బృందం

తిరుపతి సిటీ : నేపాల్ ఖాట్మండు వర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ ఎక్కు మాయఘవన్ శనివారం పద్మావతి మహిళా వర్సిటీని సందర్శించారు. ఆమెకు వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని స్వాగతం పలికి సత్కరించారు. వీసీ మాట్లాడుతూ మ్యూజిక్, ఇంజినీరింగ్, ఫార్మసి, బయోటెక్నాలజీ, సోషల్ వర్క్, ఇంగ్లీష్ లిటరేచర్, క్రాఫ్ట్స్ విభాగాల్లో స్టూడెంట్స్ మొబిలిటీ, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్, జాయింట్ సెమినార్స్ అండ్ వర్క్‌షాపులు, కొలాబరేటివ్ ప్రాజెక్టుల విషయంలో గతంలో వర్సిటీతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పరస్పరం అవగాహనకు వచ్చామన్నారు. ఈ సందర్భంగా ఖాట్మండు వర్సిటీ ప్రొఫెసర్ వర్సిటీలోని పలు విభాగాలను సందర్శించారు.

పది మంది ఎర్ర స్మగ్లర్ల అరెస్ట్



ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్ ఫోర్స్ బృందం

తిరుపతి రూరల్: తిరుపతి–అలిపిరి రోడ్డు మార్గంలో చెర్లోపల్లి వద్ద శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న పది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఏడు పిడిలేని గొడ్డళ్లు, వారు ప్రయాణించిన కారు, ఒక మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ కుమార్ బృందం తిరుపతి అర్బన్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శనివారం ఉదయం అలిపిరి రోడ్డు మీద చెర్లోపల్లి వద్ద కొంతమంది కారులో దిగుతున్నారు. వారిని సమీపించి చుట్టుముట్టగా, వారు ఎర్రచందనం కోసం అడవుల్లోకి వెళుతున్నట్లు తెలిసింది. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన బాబు, బాల మురుగన్, ప్రభు, కందస్వామి, రమేష్, కృష్ణమూర్తి, మణికంఠ, కార్తీ, రామ్‌కుమార్, రజనీ కాంత్‌గా గుర్తించారు. పారిపోయిన ఒకరి కోసం గాలిస్తున్నారు. వీరిని టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

మిలిటరీ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షకు సెప్టెంబరు 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి



కోల్‌కత్తా ఘటన బాధాకరం. ఇలాంటివి భవిష్యత్‌లో జరగకుండా డ్యూటీలో ఉన్న డాక్టర్లకు రక్షణ కల్పించాలి. ఇందుకోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తేవాలి. రాత్రి డ్యూటీలో ఉన్న డాక్టర్లనేగాక మిగిలిన మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలి. ప్రతి మహిళా డాక్టర్, ఉద్యోగులు తాము పనిచేసే ప్రదేశం సురక్షితమైనదనే భావన ఉంటేనే డ్యూటీ మీద మనసు ఉంటుంది. లేకపోతే అభద్రతా భయంతో డ్యూటీ చేయడం ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో ఆలోచించాలి. ఊరికి దూరంగా ఉన్న ప్రదేశాలలో ఆస్పత్రులు ఉంటాయి. అక్కడ బయటి వారి నుంచి సమస్య ఉండచ్చుగానీ ఒక మెడికల్ కాలేజీలో ఉన్న వ్యక్తులతోనే సమస్య రావడమనేది తలుచుకుంటేనే మనసు కలచివేస్తోంది.

– డాక్టర్ శ్రవంతి, మంగళం పీహెచ్‌సీ



ఆందోళన కలిగిస్తోంది



వైద్యుల పట్ల చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు తలచుకుంటే తీవ్ర ఆందోళన కలుగుతోంది. కోల్‌కతా ఘటనకు నిరసనగా 11 రోజులుగా స్విమ్స్‌లో ధర్నా చేస్తున్నాం. టీటీడీ నుంచి వచ్చి ఏ ఒక్కరూ మమ్మల్ని పలకరించలేదు. ఓ పక్క ఆందోళన చేస్తుంటే మరోపక్క స్విమ్స్ అత్యవసర విభాగంలో వైద్యురాలి పట్ల ఓ రోగి దురుసుగా ప్రవర్తించి దాడి చేయడం మరింత ఆందోళనకరం. వైద్యురాలిపై దాడి జరిగినా స్విమ్స్ సిబ్బంది, సెక్యూరిటీ రక్షణగా నిలబడలేకపోయారు. ఏ నమ్మకంతో మేము విధులు నిర్వహించాలి?. టీటీడీ కఠినమైన ఉత్తర్వులు జారీచేయాలి.

– డాక్టర్ కేశవర్ధిని, స్విమ్స్

● కొవ్వొత్తుల ప్రదర్శన



రేణిగుంటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ప్రైవేటు టీచర్లు, కరాటే విద్యార్థులు

కోల్‌కతా ఘటనకు నిరసనగా తిరుపతి జిల్లా ప్రైవేటు టీచర్– లెక్చరర్స్ ఫెడరేషన్ తరఫున రేణిగుంటలో శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి బస్టాండ్ గాంధీ విగ్రహం వరకు ఉపాధ్యాయులు, కరాటే విద్యార్థులు పాల్గొని కొవ్వొత్తులను వెలిగించి నిరసన తెలిపారు. జూనియర్ డాక్టర్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పాండు మాట్లాడుతూ బాధితురాలి కుటుంబానికి త్వరగా న్యాయం జరగాలని, మున్ముందు మరెవ్వరూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మానవతా విలువలను నేర్పించాలన్నారు. ఈ ర్యాలీలో జిల్లా అధ్యక్షులు అశోక్ నాయుడు, ఉపాధ్యక్షులు కరాటే కుమార్, రాజు, బాబూలాల్, సాలెహ, రియాజ్, సమీవుల్లా, గాబ్రియల్ పాల్గొన్నారు.

– రేణిగుంట

శ్రీసిటీలో ఎంఆర్ఐ రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం



శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులతో సమీక్షిస్తున్న డీపీఐఐటీ జాయింట్ సెక్రటరీ సంజీవ్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఇండియన్ రబ్బర్ మెటీరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్ఎంఆర్ఐ)కు సంబంధించిన రబ్బరు, టైర్ రీసెర్చ్ ల్యాబ్ (ఆర్‌టీఆర్ఎల్)ను శ్రీసిటీలో శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషనల్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) జాయింట్ సెక్రటరీ సంజీవ్ ఐఆర్ఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఐఆర్ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలోని పరిశ్రమలకు అవసరాలను తీర్చే రబ్బరు, టైర్ రిసెర్చ్ ల్యాబ్‌ను శ్రీసిటీలో నెలకొల్పడం ఒక ముఖ్యమైన మైలురాయిగా పేర్కొన్నారు. ఇంత వేగంగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ ఆత్మనిర్భర్ భారత్‌కు చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు. అనంతరం ఆయన శ్రీసిటీలోని డైకిన్, యాంబర్, ఈప్యాక్, బ్లూస్టార్, హావెల్స్, మ్యాగ్నం, ఎయిర్‌కండీషనర్ తయారీ కేంద్రాలను సందర్శించారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్‌రెడ్డి, కె.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.యశ్వంత్, ఎం.సంధ్య, ఎం.ముఖేష్ నాయుడు, టి.భువనేశ్వరి, జి.త్రిష, ఎం.మునిలక్ష్మి, డి.రేవంత్, కెడి.లక్ష్మి, ఎం.దిలీప్‌తో పాటు 54.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో చాలామంది తహసీల్దార్లు ఆ సీటుపై కన్నేశారు. ఆ సీటుకు తీవ్ర స్థాయిలో పోటీ రావడం, పైరవీలు కూడా అదే స్థాయిలో జరగడంతో ఆ సీటు ధర అమాంతం పెరిగిపోయింది. చాలామంది తహసీల్దార్లు అంత డబ్బు ఇచ్చుకోలేమని వెనక్కు వెళ్లగా చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన ఓ తహసీల్దారు మాత్రం రెండు కోట్లు ధర పలుకుతున్న ఆ సీటుకు కోటిన్నరకు పైగా చెల్లించి మిగతా రూ.50 లక్షలు మూడు నెలల్లో క్లియర్ చేసేలా ఒప్పందం చేసుకుని సీటును కైవశం చేసుకున్నట్టు సమాచారం. ఇంతకీ ఆ సీటు ఎక్కడుంది ? ఎందుకంత రేటు ? తెలియాలంటే ఈ కథనం చదవాల్సిందే.

తహసీల్దారు సీటు రూ.2 కోట్లు

- వేలంలో పెరిగిన ధర
- స్పాట్‌లో కోటిన్నర
- మూడు నెలల్లో మరో రూ.50 లక్షలు చెల్లించేలా ఒప్పందం?
- పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేసేలా బడా రియల్టర్లతో సెటిల్‌మెంట్
- ఆ తహసీల్దార్‌కు అడిగినంత డబ్బు సర్దుబాటు చేసిచ్చిన రియల్టర్లు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక నగరం తిరుపతికి ఆనుకుని ఉన్న ఓ మండలానికి తహసీల్దారుగా రావాలంటే పోటీ మామూలుగా ఉండదు. పైరవీలు కూడా అదే స్థాయిలో సాగుతాయి. ఎవరికి వారు రాజకీయంగాను, సీసీఎల్ఏ స్థాయిలోను శక్తి వంచన లేకుండా ప్రయత్నాలు చేస్తుంటారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఈ హాట్ తహసీల్దారు సీటుకు గతంలో అదే నియోజకవర్గంలో పనిచేసిన ఓ మహిళా తహసీల్దార్ కన్నుపడింది. ఎలాగైనా ఆ సీటు చేజిక్కించుకునేందుకు పైరవీలు మొదలుపెట్టారు. ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితుల ద్వారా రూ.75 లక్షలు ఇచ్చేందుకు సిద్ధపడినట్లు సమాచారం. అదే సీటుకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పనిచేస్తున్న మరో తహసీల్దారు కోటి రూపాయలు ఇస్తానని ముందుకు రావడం, మరో తహసీల్దారు ఏకంగా రూ.1.25 కోట్లు ఇచ్చేందుకు సిద్ధం కావడంతో ఆ సీటుకు భలే గిరాకీ ఉందనుకున్న ప్రజాప్రతినిధి అమాంతంగా ధరను పెంచేశారనే విమర్శలు ఉన్నాయి. ఏకంగా రూ.2 కోట్లు ధర నిర్ణయించడంతో అప్పటి వరకు ఆ సీటుపై ఆశపెట్టుకున్న చాలామంది తహసీల్దార్లు ఆశలు వదులుకుని మరో పోస్టింగ్ చూసుకున్నారు. అయితే పక్క జిల్లా నుంచి వచ్చిన తహసీల్దారు మాత్రం వెంటనే కోటిన్నర చెల్లించి మిగతా రూ.50 లక్షలు మూడు నెలల్లో చెల్లించేలా మాట ఇచ్చి ఆ సీటు చేజిక్కించుకున్నట్లు సమాచారం.

కాసులే కాసులు

ఆ తహసీల్దార్ పోస్టుకు ఎందుకంత గిరాకీ ఉందంటే.. ఖరీదైన ప్రభుత్వ భూములు, కొండలు, మఠం భూములు, ఇనాం భూములు, అనాధీనం భూములు, స్వర్ణముఖి నదీ పరివాహకం అధికంగా ఉండటమే. రియల్టర్లు, భూ అక్రమార్కులకు సహకరిస్తే కోట్లు సంపాదించవచ్చన్న కారణంగానే అంత పోటీ ఉంటుంది. ఓటేరు చెరువుకు సెటిల్‌మెంట్ పట్టా ఇప్పించి రిజిస్ట్రేషన్ జరిగేలా చూస్తానని జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేతో ప్రజాప్రతినిధి పెద్ద మొత్తంలో సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు సమాచారం. రెండు కోట్లు ఇచ్చి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తి ఈ వ్యవహారంలో సాయం చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు వినికిడి. ఆ తహసీల్దారు ప్రభుత్వ భూములను ఎంత మేరకు కాపాడుతారు?.. నిరుపేదలకు ఎంత మేలు చేస్తారు?.. రియల్టర్లకు ఎలా సాయం చేస్తారో?.. తేలాల్సి ఉంది.

పెండింగ్ ఫైళ్ల క్లియర్ చేసేలా ఒప్పందం

బడా రియల్టర్లతో ఆ తహసీల్దారు చేతులు కలిపి పెండింగ్ ఫైళ్ల క్లియర్ చేస్తానని రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఆ వెంటనే రంగంలోకి దిగిన రియల్టర్లు ఆ తహసీల్దారుకు ఆర్థిక సహకారం అందించారు. గత ప్రభుత్వంతో అంటకాగి నాటి మంత్రివర్యుల కనుసన్నల్లో విధులు నిర్వహించిన ఆ అధికారికి తిరుపతి జిల్లాలోనే కీలకమైన మండలానికి తహసీల్దారు పోస్టింగ్ ఇవ్వడం పట్ల టీడీపీ సీనియర్ నేతలతో పాటు కార్యకర్తలు నుంచే విమర్శలు వస్తున్నాయి.

భార్య వెళ్లిపోయిందని..!

ఏర్పేడు: మద్యం వ్యసనాన్ని భార్య భరించలేక ఇల్లు వదలి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రాజులకండ్రిగ ఎస్టీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. మండలంలోని మడిబాక పంచాయతీ పరిధి, రాజులకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన అశోక్(38) రోజూ మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో భార్య గత కొన్ని రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన అశోక్ శనివారం ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

- అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలు

నాగలాపురం: ప్రియుడు మాట్లాడలేదని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పిచ్చాటూరు బజార్ వీధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. విజయపురానికి చెందిన షరీఫ్ కుమార్తె దిల్షాద్ (30) భర్తతో విడిపోయి తండ్రి వద్ద ఉంటోంది. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆమెకు విజయపురం మండలం, వీరాపురానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అశోక్ (27)తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇద్దరూ మూడు నెలల క్రితం పిచ్చాటూరు బజార్ వీధిలో ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏమి జరిగిందో కాని అశోక్ మూడు రోజులుగా మాట్లాడలేదు. దిల్షాద్ పలుమార్లు ఫోన్ చేసినా అతను స్పందించ లేదు. దీంతో ఆమె మనస్తాపం చెంది శుక్రవారం అర్ధ రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.